ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 చిత్తూరు జిల్లా వార్తలు

బుధవారం 11 సెప్టెంబరు 2024



కలిగిరి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు రూరల్/చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10: పెనుమూరు మండలం కలిగిరి పంచాయతీ కార్యదర్శి లావణ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పంచాయతీలో పలు పనులకు సంబంధించి రూ.1.5 లక్షలకుపైగా నిధులు దుర్వినియోగం చేసినట్లు పంచాయతీకి చెందిన పలువురు డీపీవో,కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.దీనిపై జూలై 31వ తేదీన లావణ్యకు డీపీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసుకు ఎటువంటి సంజాయిషీ ఇవ్వకపోవడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. ఆ విచారణలో పలు పనులకు సంబంధించి నకిలీ బిల్లులు సమర్పించి నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలడంతో ఆమెను సస్పెండు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమాచార హక్కు చట్టంతో బయటపడ్డ అవినీతి

కలిగిరి పంచాయతీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న లావణ్య హయాంలో పలు అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగినట్లు అదే పంచాయతీకి చెందిన యుగంధర్ 2023లోనే సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించారు. ఆ సమాచారంతోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో జడ్పీ చైర్మన్, జడ్పీ సీఈవోకు ఏక కాలంలో సీసీగా ఉన్న లావణ్య భర్త సురేంద్రరెడ్డి తన పలుకుబడిని వినియోగించి ఆమెపై చర్యలను ఆపారన్న విమర్శలున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆమెపై ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సస్పెండు చేసినట్లు తెలుస్తోంది. కలిగిరికి ముందు పెనుమూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసినప్పుడూ పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న ప్రచారం ఉంది.

మూషిక వాహనంపై వినాయకుడు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 10: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి బ్రహోత్సవాలలో భాగంగా మంగళవారం మూషిక వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామాలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులు గా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌ను ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకించారు. అనంతరం స్వామిని పూర్తిగా చందనంతో కప్పి ఆకృతి కనపడేలా ఉలెన్ దారాలను వినియోగించారు. దీంతో స్వామి రూపం స్పష్టంగా భక్తులకు కనబడుతుంది. చందనాలంకారంలో స్వామిని దర్శించు కోవడానికి భక్తులు ఎంతో ఇష్టపడతారు. అలా స్వామికి చందనాలంకారం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకొచ్చి అలంకార మండలంలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను మూషిక వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు

వరసిద్ధుడికి బుధవారం ఉదయం బంగారు చిన్న శేషవాహనం, రాత్రి బంగారు పెద్ద శేషవాహన సేవలు నిర్వహించనున్నారు. దీనికి కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, 44బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.



స్వాగత గజాల ఘీంకారం



వినాయక స్వామి ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత గజాలు (కృత్రిమ ఏనుగులు) ఆకర్షణీయంగా నిలిచాయి. భక్తులు అటు రాగానే కృత్రిమ ఏనుగులు ఘీంకరిస్తూ.. తొండాలు ఎత్తుతాయి. దీంతో అందరూ మంత్రముగ్ధులవుతున్నారు. ఆలయ ఈవో గురుప్రసాద్, కాణిపాకం మాజీ సర్పంచి మధుసూదన్‌రావు తదితరులతో కలిసి కృత్రిమ ఏనుగుల వద్ద నిలబడి ఎమ్మెల్యే మురళీమోహన్ ఫొటోలు దిగారు.

ఆలయ ప్రధాన ద్వారం వద్ద కృత్రిమ ఏనుగు వద్ద ఎమ్మెల్యే, ఈవో తదితరులు

● 'హైవే' రైతులకు

దెబ్బ మీద దెబ్బ



హైవే వెళుతున్న మార్గాల్లో పొలాల వద్ద ఇలా ప్రహరీ నిర్మిస్తున్నారు



చిత్తూరు రూరల్ మండలంలో చురుగ్గా సాగుతున్న చిత్తూరు- తచ్చూరు హైవే పనులు

పొలాల మధ్యన జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోందంటే ఆ రైతులకు ఎంతో కొంత ప్రయోజనం ఉండాలి. కానీ, చిత్తూరు- తచ్చూరు హైవే వల్ల మాత్రం రైతులకు దెబ్బమీద దెబ్బ పడుతోంది. చుట్టుముడుతున్న సమస్యలతో సతమతమవుతున్నారు. వీరి ఆవేదన.. ఆందోళనను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తొలి నుంచీ రైతులకు సీపీఐ నేత నారాయణ మద్దతుగా నిలిచారు. తాజాగా నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ కేంద్ర మంత్రిని కలిశారు.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

- ఇప్పటికే పరిహారం విషయంలో రాజీ
- చిత్తూరు- తచ్చూరు ఎన్‌హెచ్‌కు సర్వీసు రోడ్లులేక ఇబ్బందులు
- తాజాగా పొలాల వద్ద ప్రహరీ నిర్మాణం

చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి 126.55 కిలోమీటర్ల మేర సాగుతుంది. దీన్ని రూ.3197.56 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు. చిత్తూరులో ప్రారంభమై జిల్లాలోని 8 మండలాల మీదుగా 83 కిలోమీటర్లు.. తమిళనాడులో 43.55 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. భూసేకరణ పూర్తయి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రహదారి జిల్లాకు మేలు కంటే మన రైతులకు నష్టమే ఎక్కువ చేసిందని చెప్పవచ్చు. ఈ నష్టం పరిహారం నుంచే మొదలైంది. 'మీ పొలాల్లో జాతీయ రహదారి వస్తే మీ భూములకు విలువ పెరుగుతుంది. ఇప్పుడు పరిహారం తక్కువైనా, భవిష్యత్తులో మీ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. భూములకు మంచి ధర లభిస్తుంది' అని అధికారులు రైతులకు ఆశ చూపారు. దీంతో పరిహారం తక్కువైనా రైతులు భూసేకరణకు సమ్మతి పత్రాల్లో సంతకాలు చేసేశారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలోని రైతులకు ఇచ్చిన పరిహారంలో 10శాతం మాత్రమే మన రైతులకు ఇచ్చారు. ఇంత తక్కువగా ఇవ్వడంపై ఏళ్లగా రైతులు పోరాటాలు చేసినా ఫలితం లేదు. మన రాష్ట్ర రైతులకు జరిగిన అన్యాయంపై నాటి వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. ఇక, జాతీయ రహదారి అంటే అన్నిచోట్ల ఉన్నట్లే ఇక్కడా సర్వీసు రోడ్లు ఉంటాయని భావించారు. తీరా భూసేకరణ పూర్తయ్యాక ఈ జాతీయ రహదారిలో సర్వీసు రోడ్లు ఉండవని, అవసరాన్ని బట్టి మీ పరిహారంతో సర్వీసు రోడ్లను మీరే నిర్మించుకోవాలని ప్రాజెక్టు అధికారులు తేల్చి చెప్పారు. దీంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎందుకంటే.. చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి కొత్తగా నిర్మిస్తున్నది కావడంతో మొత్తం పొలాల మీదుగానే వెళుతోంది. పొలాల వద్దకు వెళ్లేందుకు ఇదివరకు ఉన్న బండి బాటలు, చిన్న చిన్న దారులన్నీ మూసుకుపోయాయి. చిత్తూరు మండలం ఎల్బీపురం గ్రామానికి చెందిన రైతు మోహన్ భూమి మధ్యలో జాతీయ రహదారి వెళుతోంది. దీంతో అతడి భూమి రెండుగా విడగొట్టినట్లయింది. సర్వీసు రోడ్లు లేకుంటే హైవేకు రెండు వైపులా ఉన్న తన పొలాలకు వెళ్లడం ఆయనకు కష్టమవుతుంది. ఈ సమస్యను వందలాది మంది రైతులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల చాలా పొలాలు బీడుగా మారిపోయే అవకాశాలున్నాయి. సర్వీసు రోడ్లు ఉంటేనే సాగు చేసేందుకు అనుకూలం. ఇప్పుడేమో ఈ హైవే పక్కనున్న పొలాలకు అడ్డంగా ప్రహరీ నిర్మిస్తున్నారు. దీంతో పంట ఉత్పత్తుల్ని తరలించేటప్పుడు రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటికేపడుతున్న ఇబ్బందులకు.. ఈ ప్రహరీ నిర్మాణం అనే కొత్త సమస్యతో మరింత తీవ్రంగా మారిందని ఆవేదన చెందుతున్నారు.



ఆదివారం హైవే పరిశీలనకు వెళ్లిన నారాయణకు సమస్యలు చెబుతున్న బాధిత రైతులు

గడ్కరీ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే

చిత్తూరు తచ్చూరు హైవేకు సర్వీసు రోడ్డు నిర్మించాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం ఆయన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రైతుల సమస్యను వివరించారు. సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరారు.

ఇప్పుడైనా స్పందిస్తేనే..

కొత్తగా జాతీయ రహదారిని నిర్మించేటప్పుడు, అభివృద్ధి చేసేటప్పుడు ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎక్కడెక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలనేది తీర్మానించుకోవాలి. వైసీపీ ప్రభుత్వంలో మొదలైన చిత్తూరు- తచ్చూరు హైవే విషయంలో అలాంటివేవీ జరగలేదు. అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సి ఉంది. దీనిపై కలెక్టరు సుమిత్‌కుమార్ కల్పించుకుని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

తొలినుంచీ సీపీఐ నారాయణ పోరాటం

చిత్తూరు- తచ్చూరు హైవేలో భూములు కోల్పోయిన రైతులకు మద్దతుగా తొలి నుంచీ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ నిరసనలు చేపడుతున్నారు. 2022 అక్టోబరులో ఆయన కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నా చేశారు. రైతుల వద్ద భూములు తీసుకుని పరిహారాన్ని బిచ్చమేసినట్లు ఇచ్చారని ఆగ్రహించారు. తాజాగా సర్వీసు రోడ్డు వేయకపోవడం, పొలాలకు ప్రహరీ నిర్మిస్తుండడంతో ఆయన ఆయా ప్రాంతాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ అంశాలను 15 రోజుల్లో పరిష్కరించాలని, లేకుంటే ఇదే హైవే మీద వంటా వార్పుతో ఉద్యమాలను మొదలు పెడతామని హెచ్చరించారు.



కొన్ని ప్రాంతాల్లో పూర్తయిన హైవే పనులు



మంత్రులకు చెక్ అందజేస్తున్న విజయవాణి విద్యాసంస్థ అధినేతలు

వరద బాధితులకు 'విజయవాణి' విద్యాసంస్థల విరాళం రూ.25లక్షలు

చౌడేపల్లె, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చౌడేపల్లె లోని విజయవాణి విద్యాసంస్థల యాజమాన్యం సీఎం సహాయ నిధికి రూ.25 లక్షల విరాళం అందజేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మంగళవారం విజయవాడలో మంత్రులు నారా లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆ సంస్థ అధినేతలు నాయిని మహేశ్‌కుమార్, శశికుమార్, హర్ష అందజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారులు వరద సహాయక కార్యక్రమాలను సంతృప్తికరంగా చేస్తున్నారని, తమ వంతు సాయం అందించడానికి వచ్చామన్నారు. బాధితులకు అండగా నిలవడానికి సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.25 లక్షలు ఇవ్వడం అభినందనీయమని మంత్రులు లోకేశ్, రాంప్రసాద్‌రెడ్డి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడితో పాటు చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డి, నాయకులు చిట్టి, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రేడు-2, వీఆర్వోల బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10: కలెక్టరేట్ మీటింగ్ హాలులో గ్రేడ్-2, వీఆర్వోల బదిలీలకు సంబంధించి గురువారం కౌన్సెలింగ్ జరగనుంది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయిదా పడ్డ ఉద్యోగుల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

కరెన్సీ వినాయకుడు

పలమనేరు బోయవీధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాన్ని మంగళవారం రాత్రి స్థానికులు కరెన్సీతో అలంకరించారు. దీనికోసం రూ.70 వేల విలువైన నోట్లను వాడారు. కరెన్సీ అలంకరణను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

\- పలమనేరు



టమోటా ముసుగులో రేషన్ బియ్యం అక్రమ రవాణా

గంగవరం, సెప్టెంబరు 10: పైకి టమోటా బాక్సులు పెట్టి.. ఈ ముసుగులో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారం అందడంతో గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. చిత్తూరు నుంచి పలమనేరు వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా.. వెనుక వైపు టమోటా ఖాళీ బాక్సులు దర్శనమిచ్చాయి. ఎక్కడికి వెళ్తున్నావని వాహన డ్రైవర్‌ను పోలీసులు ప్రశ్నించగా అతడు తడబడాడు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి టమోటా బాక్సులను కిందికి దించి చూడగా, రేషన్ బియ్యం బయటపడింది. వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనంలో సుమారు మూడు వేల కిలోల ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రేషన్‌బియ్యం, స్ట్రీమ్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. బియ్యం రవాణాలో కీలక పాత్ర పోషించిన గణేష్, జిలానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.



టమోటా బాక్సుల ముసుగు తొలగించడంతో బయటపడ్డ రేషన్ బియ్యం

ఉపాధి హామీ కింద స్కూలు మైదానాల అభివృద్ధి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



యూటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితా విడుదల, సీఎంసీ ఆస్పత్రి మెడికల్ బిల్లుల సమస్య, రివర్షన్ ఆర్డర్స్, పని సర్దుబాటులో అసంబద్ధతలు, కారుణ్య నియామకాలు, పాఠశాలల స్థలాల సర్వే తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారదిశగా అన్ని సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల ఆటస్థలాల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.12 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో గ్లోరియా, ఎస్టీయూ, యూటీఎఫ్ ముఖ్యనేతలు గంటా మోహన్, జీవీ. రమణ, మదన్‌మోహన్ రెడ్డి, మోహన్ యాదవ్, సోమశేఖర్ నాయుడు, మణికంత, హేమచంద్రారెడ్డి, యువరాజు, రెహనా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల బాధ్యులపై చర్యలు

మాతా,శిశు మరణాలు జరిగినట్లు తేలితే బాధ్యులైన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారుల సమీక్షలో కలెక్టర్ హెచ్చరించారు. గ్రామీణ స్థాయిలో హైరిస్క్ గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, కాన్పునకు వారం రోజులముందుగా ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించాలన్నారు. అందుకయ్యే ఆర్థిక, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్ రెడ్డి, డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, డీఐవో హనుమంతరావు, డీఎంఆర్ జిల్లా నోడల్ ఆఫీసర్ జానకిరావు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన రిజిస్ట్రేషన్‌కు అవగాహన

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం విశ్వకర్మ యోజన రిజిస్ట్రేషన్లపై అవగాహన పెంచాలని కలెక్టర్ ఎంపీడీవోలను కోరారు. ఈమేరకు ఆయన వారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించిందన్నారు. లబ్ధిదారులకు రూ.15 వేలు విలువ చేసే పరికరాలు అందిస్తామన్నారు.

శ్రీవారి సేవలో రవిశంకర్



తిరుమల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్నారు.ఆలయంలోని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.60 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 67,030 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 23,476 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

పీజీ అడ్మిషన్లకు గడువు పెంపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: పద్మావతి మహిళా యూనివర్సిటీలో పీజీ ప్రవేశ గడువును ఈ నెల 12వ తేదీ దాకా పొడిగించారు. ఏపీపీజీసెట్ ర్యాంకు పొంది, పద్మావతి వర్సిటీలో సీట్ కేటాయింపు పొందిన వారు ఈ నెల 12వ తేదీ లోపు ప్రవేశం పొందవచ్చన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు తొలుత గడువు విధించామని, విద్యార్థుల సౌకర్యార్థం 12వ తేదీ దాకా పొడిగించినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

అమెరికన్ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రొఫెసర్ల బృందం

20 రోజుల పాటు అధ్యయనం చేసే అవకాశం



ఫర్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రతినిధుల బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: అమెరికాలోని ఫర్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం పర్యటిస్తోంది. ఈ నెల 7వ తేదీ తిరుపతి నుంచి బయలుదేరిన ఈ బృందం అమెరికాకు చేరుకుంది. ఈక్రమంలో అమెరికాలోని ఫర్డ్యూ యూనివర్సిటీతో గతంలో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ పర్యటన కొనసాగుతూ ఉంది. ఈ పర్యటనకు రుసా నిధులు వెచ్చించనుంది. 20 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా ఫర్డ్యూ యూనివర్సిటీలో అమలవుతున్న బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పురోగతిని అధ్యయనం చేయనుంది. తద్వారా ఆ వర్సిటీతో ఎంటర్‌ప్రైనర్‌షిప్ కొలాబరేషన్‌కు ప్రయత్నం సాగుతుంది. ఈ బృందంలో రుసా సీఈవో రాయల వంశీకృష్ణ, రుసా కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ టి. రమాశ్రీ (ఈసీఈ విభాగం, ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ వి. ఉషారెడ్డి (ఈఈఈ విభాగం, ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ ఎం.హేమ (వైరాలజీ విభాగం), ప్రొఫెసర్ కె.సుమకిరణ్ (ఇంగ్లీషు విభాగం), ప్రొఫెసర్ కె.వి.సుచరిత (హోం సైన్స్ విభాగం) ఉన్నారు. ఈ పర్యటన పూర్తయ్యాక అమెరికాలోని ఫర్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా ఎస్వీయూనివర్సిటీని సందర్శించి, కొలాబరేషన్‌పై అధికారిక నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకోసం ప్రస్తుత పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

బంగారం విక్రయిస్తానంటూ బురిడీ

యువకుడి అరెస్టు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: బంగారం విక్రయిస్తా నంటూ బురిడీ కొట్టించిన హేమచంద్రారెడ్డి(35) అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హేమచంద్రారెడ్డి ఓ ప్రైవేటు సంస్థలో బంగారు ఆభరణాలను ఏడాది క్రితం తనఖా పెట్టాడు. వాటిని విడిపించి విక్రయించేందుకు తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థ నిర్వాహకులతో ఫోన్‌లో ఒప్పందం చేసుకున్నాడు. ఆ ప్రకారం వారి ద్వారా రెండు నెలల క్రితం రూ.2లక్షల నగదు తీసుకుని బంగారాన్ని విడిపించకుండానే పరారయ్యాడు. తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థకు చెందిన నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పటి నుంచి యువకుడు పరారీలో ఉన్నాడు. ఇటీవల మరో రెండు ప్రైవేటు సంస్థలను బంగారం విక్రయిస్తానని నమ్మించి నగదు తీసుకుని మోసం చేశాడు. బాధితులు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు మంగళవారం హేమచంద్రారెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మౌలిక వసతులు కల్పించండి

● కలెక్టర్‌కు పలువురు అర్జీదారుల వినతి

చిత్తూరు, సెప్టెంబరు 10: కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 112 మంది అర్జీదారులు వచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులకు వినతులను అందజేశారు. అధికంగా రెవెన్యూశాఖకు 96 వినతులు అందాయి. పోలీసు, డీపీవో, పశు సంవర్థకశాఖ, పౌరసరఫరాలు, డీఎంహెచ్‌వో, నగరి మున్సిపాలిటీ, తదితర శాఖలకు 16 అందాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ వినతిపత్రాలను స్వీకరిస్తూ అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా విన్నారు. అప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, డిప్యూటీ కలెక్టర్ భవాని, డీఆర్‌డీఏ పీడీ తులసీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని....

● వెదురుకుప్పం మండలంలోని ఎస్టీ కాలనీల్లో మౌళిక వసతులతో పాటు శ్మశానవాటికలకు స్థలాలను కేటాయించాలని యానాది సంఘం నేతలు, పలువురు గిరిజనులు కోరారు. ఎస్టీలు నివాసాలుండే కాలనీలకు సరైన రోడ్డు వసతి, సిమెంటు రోడ్డు, వాటర్‌ట్యాంకు సదుపాయాలు లేదన్నారు. సబ్సిడీ డ్రిప్ పరికాలను ఇవ్వాలని కొందరు రైతులు కోరారు.

● తనకు ప్రభుత్వం కేటాయించిన 3.20 ఎకరాల భూమిని సర్వే చేయించకుండా కొందరు అడ్డుకుంటున్నారని చౌడేపల్లె మండలం పొదలపలెకు చెందిన రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

● పశువుల మేత భూమిగా ఉపయోగించుకుంటున్న తమ భూములను కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని బంగారుపాళ్యం మండలం మొగిలి యానాదులు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 61లోని ఊరగుట్ట భూమిని తాము ఏళ్ల తరబడి పశువుల మేతభూమిగా, శ్మశానంతో పాటు మరికొంత భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. దొర చెరువుకు చెందిన ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులను లోబరుచుకుని పట్టాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వీరు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ఫలసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు పట్టాలివ్వాలని కోరారు.

● వెదురుకుప్పం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని తమ కాలనీకి సరైన రోడ్డు వసతి లేదని ఎస్టీకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో 25 కుటుంబాల వరకు జీవనం సాగిస్తున్నామన్నారు. అనారోగ్యం పాలైతే 108 వాహనాలు రావడం లేదన్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రోడ్డు వసతి కల్పించాలని కోరారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమత్‌కుమార్

పోలీసుశాఖకు 25 ఫిర్యాదులు

పోలీసు కార్యాలయంలో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 25 మంది తమ సమస్యలను ఎస్పీ మణికంత దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకుంటామని బాధితులకు ఎస్పీ హామీ ఇచ్చారు. భూ తగాదాల కింద 16, కుటుంబ తగాదాలు 03, డబ్బు తగాదాలు 02, దారి సమస్యలు 02, వేధింపులు 01 వంతున అర్జీలు అందాయి. డీఎస్పీ సాయినాథ్, అధికారులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంట

పండుగ కోసం వచ్చి..!

రోడ్డుప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి ● మరొకరికి తీవ్రగాయాలు



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

గంగవరం, సెప్టెంబరు 10: వినాయక చవితి పండుగ కోసం వచ్చిన ఆర్మీజవాను రోడ్డుప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఈ ఘటన గంగవరం మండలంలోని మామడుగు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం నడింకల్లాడు గ్రామానికి చెందిన బాలక్రిష్టారెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి (21) ఏడాది క్రితం ఆర్మీజవానుగా ఉద్యోగంలో చేరారు. వినాయక చవితి పండుగ రావడంతో స్నేహితులు, కుటుంబసభ్యులతో కలసి సంతోషంగా గడపాలని సెలవు పెట్టి మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. స్నేహితులు, బంధువులతో సరదాగా గడిపారు. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి అమ్మమ్మ కర్ణాటక రాష్ట్రం నంగిలి సమీపంలోని గుమ్మకల్లు గ్రామంలో ఉండడంతో ఆమెను కలవడానికి గ్రామానికి చెందిన పూర్ణచంద్ర (25)తో కలసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. ఆమెతో మాట్లాడి ఇద్దరూ తిరుగు ప్రయాణమయ్యారు. గుమ్మకల్లు గ్రామం నుంచి పలమనేరు వైపు హైవేలో వస్తుండగా మామడుగు సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వీరిని ఢీకొని వెళ్లిపోయింది. ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే చంద్రశేఖర్‌రెడ్డి మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న పూర్ణచంద్రను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



వినోద్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

నగరి, సెప్టెంబరు10: నగరి మున్సిపాలిటీ పరిధిలోని నత్తం కండ్రిగకు చెందిన కానిస్టేబుల్ వినోద్‌కుమార్ (32) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన నింద్ర పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై నగరి వస్తుండగా మార్గమధ్యలో ఫ్రైడ్‌ఇన్ హోటల్ వద్ద ఎదురుగా వస్తున్న సిమెంటు లారీ ఓవర్‌టేక్ చేయబోయారు. ఈక్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో లారీ ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందారు. ఈయన భార్య కళావతి ముడిపల్లి సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వినోద్‌కుమార్ మృతితో నెత్తంకండ్రిగ విషాదఛాయలు అలముకున్నాయి.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనం బోల్తాపడి మహిళ మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నూరున్నీషా

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: పుంగనూరు బైపాస్‌రోడ్డులోని చౌడేపల్లె సర్కిల్లో ఉయ్యాలవాడ విగ్రహం వద్ద ద్విచక్రవాహనం బోల్తా పడి ఓ మహిళ మృతి చెందింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన నూరున్నీషా(40) తన కుమారుడు బావాజాన్‌తో కలసి సోమవారం ద్విచక్ర వాహనంలో పలమనేరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా ఉయ్యాలవాడ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్ వద్ద ఆమె అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ లోకేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. మహిళ అరెస్టు

గుడుపల్లె, సెప్టెంబరు 10: కర్ణాటక మద్యం తరలిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. గుడుపల్లె మండల సరిహద్దులో ఉన్న కర్ణాటక మద్యం దుకాణాల నుంచి మండలంలోని బెల్టు షాపులకు మద్యం రవాణా సాగుతోందని పోలీసులకు సమాచారం ఉంది. ఈ క్రమంలో మంగళవారం పోలీసులు కుప్పం- పొగురుపల్లె రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. కుప్పిగానిపల్లెకు చెందిన రాజేశ్వరి ద్విచక్ర వాహనంలో కర్ణాటక నుంచి 190 ప్యాకెట్ల మద్యాన్ని తరలిస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. సంచిలోని మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.



కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన ఎస్ఈబీ పోలీసులు

కర్ణాటక మద్యం తరలింపు.. ఇద్దరి అరెస్ట్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పుంగనూరు ఎస్ఈబీ ఎస్ఐ హరికృష్ణ కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం రాజుపల్లె వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. పుంగనూరు మండలం కొత్తపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి(37), మర్రిమాకులపల్లెకుచెందిన హరినాథరెడ్డిలు బొలెరో వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం, వాహనం స్వాధీనం చేసుకునానరు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వీఆర్‌కు తిరుమల టూ టౌన్ సీఐ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: తిరుమల టూ టౌన్ సీఐగా మూడు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్‌ను మళ్లీ వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీ యూనివర్శిటీ సీఐగా మురళీమోహన్ పనిచేశారు. తెలుగుయువత శ్రేణులు గత ఏడాది అప్పటి ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద దహనం చేశాయి.ఈ ఘటనపై యూనివర్శిటీ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.తెలుగు యువత నేతలు ఈ విషయాన్ని తాజాగా అమరావతి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వైసీపీకి సీఐ మురళీమోహన్ గతంలో ఏ విధంగా సహాయ సహకారాలందించారో వివరించారు.ఈ నేపథ్యంలో మురళీమోహన్‌ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులొచ్చినట్లు సమాచారం.తిరుమల క్రైం సీఐగా పనిచేస్తున్న శేషగిరిని టూటౌన్‌కు ఇన్‌చార్జి సీఐగా నియమించారు.

హెల్మెట్ల వినియోగంపై తిరుమల ఘాట్‌లో తనిఖీలు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు వినియోగిస్తున్నారా లేదా అనే అంశంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రమాదాల నివారణ కోసం టీటీడీ కొన్నేళ్లుగా ఘాట్‌రోడ్లలో హెల్మెట్ వినియోగం తప్పనిసరి నిబంధనను అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అయితే తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రయాణించే తిరుమల స్థానికులు, వ్యాపారులు, ఉద్యోగులు అలిపిరి చెక్‌పాయింట్, జీఎన్సీ టోల్‌గేట్లతో తనిఖీల వరకే హెల్మెట్ పెట్టుకుని ఆ తర్వాత తొలగించి ప్రయాణిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఆగస్టు 26న 'హెల్మెట్ ఏదీ గోవిందా..!' అనే శీర్షిక కథనం ప్రచురించింది. దీంతో తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్, ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ఇప్పటికే పలుమార్లు తిరుమలలోని జీఎన్సీ, అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఇప్పటికీ కొంతమంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను వినియోగించడం లేదనే సమాచారంతో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ మంగళవారం మొదటి ఘాట్‌రోడ్డు మధ్యలోని హరిణి ప్రాంతంలో సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్లు పెట్టుకోకుండా ప్రయాణిస్తున్న వారిని నిలిపి అవగాహన కల్పించారు. ఇకపై తప్పనిసరిగా హెల్మెట్లు ధరిస్తామని, ఎట్టిపరిస్థితుల్లోనూ హెల్మెట్లు లేకుండా ప్రయాణించమని వారితో ప్రమాణం చేయించారు. మరోసారి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



హెల్మెట్ల వినియోగంపై ప్రమాణం చేయిస్తున్న సీఐ

వేడుకగా ఆలయ శుద్ధి

● 16 నుంచి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 10: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 16 నుంచి మూడు రోజులపాటు వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, అర్చకులు సుగంధ పరిమళ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాలతో ఆలయంలో ప్రోక్షణ చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఇక ఈనెల 15న అంకురార్పణతో అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16న పవిత్ర ప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ, 18న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి. పవిత్రోత్సవాలు పురస్కరించుకుని పై నాలుగు రోజులు ఆర్జితసేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్‌రెడ్డి అనే భక్తుడు 11 పరదాలను కానుకగా అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.





పరమేశ్వరమంగళం పీహెచ్‌పీ ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన

వైద్యవృత్తి ప్రగతికి ప్రతిబంధకంగా జీవో 85

పుత్తూరు/పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 10: వైద్య వృత్తి ప్రగతికి ప్రతిబంధకంగా వున్న జీవో 85ను వ్యతిరేకిస్తూ మంగళవారం పుత్తూరు మండలం లోని గొల్లపల్లి, పరమేశ్వరమంగళం పీహెచ్‌సీలోని వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధి కారి చైతన్య మాట్లాడుతూ కొవిడ్ సమయంలో జీవితాలను పణంగా పెట్టి గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందించామని తెలిపారు. ఈ ఉత్తర్వు వల్ల తమ విలువైన మూడేళ్ల సర్వీసు నష్టం పోతామని, పీజీ సీట్లలో 30 నుంచి 15 శాతానికి కుదించడం వల్ల దాదాపు 2500 గ్రామీణ వైద్యులు ఉన్నత స్థాయి చదవులను కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని అంచెలవారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వరద బాధితులకు రూ.10 వేలు ఆర్థికసాయం



కుప్పం, సెప్టెంబరు 10: కుప్పం పురపాలక సంఘం 5వ వార్డు పరిధిలోని తంబిగానిపల్లె మెప్మా మహిళా ప్రతినిధులు విజయవాడ వరద బాధితులకు రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ నగదు మొత్తం చెక్కును మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు మానవతతో స్పందించి వరద బాధితులకు చేతనైన సాయం చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇలాగే ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం



పారిశుధ్య కార్మికులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, సెప్టెంబరు 10: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆయన మంగళవారం బుడమేరు వాగు ముంపునకు గురైన కోడూరువారి వీధిలో పర్యటించారు. వరదల్లో నష్టపోయిన కుటుంబాలను పరామర్శించారు. అక్కడి పారిశుధ్య కార్మికులను అభినందించారు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్ సరుకులు అందాయో లేదో తెలుసు కున్నారు. అందకపోతే వెంటనే పంపిణీ చేయాలని స్థానిక అధికారులకు సూచించారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు, సెప్టెంబరు10 : పలమనేరు ప్రాజెక్టు పరిధిలోని రెండు అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని కోరారు. గంగవరం మండలం గంగవరం, పెద్దపంజాణి మండలం బందార్లపల్లి గ్రామాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని సీడీపీవో కార్యాలయంలో ఈనెల 21 వతేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని కోరారు. వివరాలకు సీడీపీవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కల్లూరు: పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సూపర్‌వైజర్ విజయలక్ష్మీ తెలిపారు. పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీ ఆర్ కుమ్మరపల్లి మినీ అంగన్వాడీ కేంద్రంలో- వర్కర్ (బీసీ-ఏ), కావేటిగారిపల్లి పంచాయతీ చెన్నుపాటి వారిపల్లి మినీ అంగన్వాడీ కేంద్రంలో- వర్కర్ (ఓసీ), హెల్పర్ (ఓసీ), రొంపిచెర్ల మండలం బోటిపాటివారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్ (బీసీ-బీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ పోస్టులకు స్థానికులై 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. 1-7-24 నాటికి అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలు పూర్తయి ఉండాలని, 35 సంవత్సరాలకు మించరాదని తెలియజేశారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 వరకు దరఖాస్తులను పులిచెర్ల సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పుంగనూరు రూరల్: పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. పుంగనూరులోని రాంనగర్, ఆరడిగుంట, సోమల మండలం పిరంగులగుట్ట, ముండ్రివారిపల్లెలో అంగన్వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వివరాలకు పుంగనూరు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

శాంతిపురం: శాంతిపురం మండలం పరిధిలోని అంగన్వాడీల్లో ఉన్న ఖాళీలకు అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కల్పన కోరారు. నక్కనపల్లెలో ఆయా పోస్టుకు (ఓసీ), కర్లగట్టలో కార్యకర్త పోస్టుకు (ఓసీ) ఈ నెల 21తేదీలోపు శాంతిపురం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుప్పం, సెప్టెంబరు 10: పురపాలక సంఘం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డు పరిధిలోని తంబిగానిపల్లె, గుల్లేపల్లెల్లో మంగళవారం ఆయన మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి వార్డు బాట నిర్వహించారు. ప్రజలనుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ముఖ్యంగా రోడ్లు, మురుగు కాలువలు, పింఛన్లు, ఇళ్ల మంజూరు వంటి సమస్యలపై వినతులు అందాయి. వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ నాయకుడు జాకీర్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి నృత్యార్చన



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో బహుమతులు సాధించిన విద్యార్థులు

గంగవరం, సెప్టెంబరు 10: వినాయకుడి పండుగ అంటే చాలావరకు డీజేసాంగ్‌లు, డప్పులు, వాయిద్యాల చప్పుడుల మధ్య యువకులు కేరింతలు కొట్టడం చూస్తూనే ఉంటాం. అయితే వినాయకుడి పండుగను సంప్రదాయ బద్ధంగా జరపాలనే నిశ్చయంతో గంగవరం సాయినగర్‌లో రెండురోజుల నుంచి వినాయకుడి భజనలు, వినాయకుడి జీవిత విశేషాలు వంటి కార్యక్రమాలు చేపట్టారు. మూడవరోజైన మంగళవారం శాస్త్రీయ నృత్యాలతో విద్యార్థులు విశేషంగా ఆకట్టుకున్నారు. సాయిగర్‌కు చెందిన పలువురు విద్యార్థులు సంప్రదాయ పట్టుచీరలను ధరించి శాస్త్రీయ నృత్యాలతో గణేశుడిని అర్చించారు. తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, ఎన్‌జీఓ సంఘ అధ్యక్షులు ఆనంద్‌బాబు, శ్రీనివాసులు రెడ్డి దేవకుమార్, డాక్టర్ మాధవి తదితరులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో పాల్గొన్న వారికి బహుమతులు అందించి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: పుంగనూరు- రామసముద్రం మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా రామసముద్రానికి చెందిన రామకృష్ణ, భార్య సుకన్య ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయండి

చౌడేపల్లె, సెప్టెంబర్10: బోయకొండలో గత ప్రభుత్వంలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు వాడ గంగరాజు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు కేటాయించాలని విన్నవించారు. న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని గంగరాజు తెలియజేశారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

శాంతిపురం: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని పర్యావరణ ప్రేమికుడు కిషోర్ విద్యార్థులను కోరారు. మంగళవారం శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ విని యోగంపై వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువ భారత్ అధ్యక్షులు వేకాంత్, కార్యదర్శి గోవిందప్ప, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో అమర్

పలమనేరు: స్థానిక శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దర్శించుకున్నారు.

రిస్క్ ఎందుకు..? రెఫర్ చేసేద్దాం..!

- పలమనేరు ప్రభుత్వాస్పత్రి వైద్యుల తీరు
- సిబ్బంది కొరతే కారణం
- ఇబ్బందుల్లో జనం
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



పలమనేరు, సెప్టెంబరు10 : పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీవ్ర అనారోగ్యంతో ఎవరైనా రోగులు వస్తే మనకెందుకులే రిస్క్ అనేలా ఇక్కడి సిబ్బంది వెంటనే చిత్తూరుకు రెఫర్ చేస్తున్నారనే విమర్శలున్నాయి. అందుకే ఈ స్పత్రికి రెఫర్ ఆస్పత్రిగా ఇక్కడి జనం పేర్కొంటున్నారు. నియోజకవర్గ కేంద్రమైన పలమనేరులో 60వేలకు పైగా జనం ఉన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం నూతన భవనాన్ని నిర్మించింది. అయితే వైద్యులను, సిబ్బందిని నియమించలేదు. పోస్టులు భర్తీకాకపోవడంతో పాటు ఉన్నవారిలో పలువురు డెప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో పనిభారంతో ఇక్కడి వైద్యులు, నర్సులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇక్కడి వైద్యసేవలు అందేది అంతంత మాత్రమే అని జనం విచారం వ్యక్తం చేస్తున్నారు.

కానుపా.. అయితే చిత్తూరుకే..!

రాత్రివేళల్లో ఎవరైనా కానుపు కోసం వస్తే వెంటనే చిత్తూరుకు రెఫర్ చేస్తున్నారనే విమర్శలున్నాయి. చిత్తూరుకు 108లో వెళ్తూ పలువురు పురుడుపోసుకొన్న ఘటనలు అనేకం ఉన్నాయి. నాలుగురోజుల క్రితం పలమనేరు కు చెందిన ఒక వ్యక్తి అర్ధరాత్రి తన భార్యను తీవ్రమైన గ్యాస్టిక్ సమస్యతో ఆస్పత్రికి వస్తే ఆమెను చిత్తూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇక్కడ ఈసీజీ తీసి పరీక్షించిన డ్యూటీ డాక్టర్ ఆమెను చిత్తూరుకు రెఫర్ చేశారు. చిత్తూరుకు వెళ్లి అక్కడ ఆస్పత్రిలో మళ్లీ ఈసీజీ తీసి అక్కడి డాక్టర్ భయపడాల్సిన పనిలేదని ఇది కేవలం గ్యాస్టిక్ సమస్య మాత్రమే అని కొన్ని మందులు ఇచ్చి ఇంజక్షన్ వేసిన కొద్దిసేపటికే ఆ మహిళ కోలుకొంది. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ ఆస్పత్రిలో వ్యథలకు కొదవుండదు. ఈ సంఘటనపై సదరు వ్యక్తి మంగళవారం ఆస్పత్రి సూపరింటిండెంట్‌ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా గతనెలలో దాదాపు డెలివరీ, కార్డియాలజీ, ఆర్థో తదితరాలు కలిపి దాదాపు 15 కేసులను రెఫర్ చేసినట్లు సమాచారం.

వైద్యపోస్టులు ఖాళీ :

ఆస్పత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టు, డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టు, రెండు సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు నర్సింగ్ సూపరింటిండెంట్ పోస్టు, ఫార్మసిస్టు పోస్టు, థియేటర్ అసిస్టెంట్, డార్కురూం అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు రెండు, ప్లంబర్ పోస్టు ఇక్కడ ఖాళీగా ఉన్నాయి. కనీసం ఈసీజీ తీసేందుకు సిబ్బంది లేకపోవడంతో డ్యూటీలో ఉన్న నర్సులే తీస్తుంటారు.

మరోశాఖకు బదిలీ అయినా :

ఇక్కడ పనిచేసే నర్సు ఒకరు ఉన్నత చదువు కోసం తిరుపతి వెళ్లి అక్కడ చదువు పూర్తి చేసి అక్కడే నర్సింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. అయితే సదరు నర్సు పోస్టు ఇక్కడే ఉన్నందున ఆమె ఇక్కడ జీతం తీసుకుంటున్నారు. ఫలితంగా ఈ పోస్టు సాంకేతికంగా ఖాళీ లేక భర్తీకి నోచుకోలేదు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు ఎప్పుడో..!

ఇక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఇంటిముఖం పట్టింది. దీంతో రోగుల గోడు పట్టించుకొనే నాథుడే లేడు. నూతన కమిటీ ఏర్పాటైతే కొంతవరకు సమస్యలు పరిష్కారం అవుతాయని రోగులు పేర్కొంటున్నారు.

నిబంధనల మేరకే రెఫర్ చేస్తున్నాం

తప్పనిసరి సరిస్థితులలో నిబంధనల మేరకే రెఫర్ చేస్తున్నాం. ఖాళీల కారణంగా పనిచేస్తున్న వైద్యులకు పనిభారం ఉన్న మాట వాస్తవమే. సమస్యలజాబీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి

చిన్నారి జన్మదినం సందర్భంగా అన్నక్యాంటీన్‌లో అన్నదానం



రామకుప్పం, సెప్టెంబరు 10: తెలుగుమహిళ రామకుప్పం మండల అధ్యక్షురాలు పద్మమ్మ మనవడు ధార్విక్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆమె కుటుంబసభ్యులు రామకుప్పం అన్నక్యాంటీన్‌లో అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతిలు పార్టీ నాయకులతో కలిసి చిన్నారి ధార్విక్‌చే కేట్ కట్‌చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 200మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్‌రఫీ, వెంకటరమణ, గజేంద్ర, ఆదిల్, మంజునాథ్, రఘు, కామరాజనాయక్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.71లక్షలు పలికిన చదళ్ల వినాయకుడి లడ్డూ



పుంగనూరు, సెప్టెంబరు 10: పుంగనూరు మండలం చదళ్ల గ్రామంలో వినాయక విగ్రహం వద్ద గ్రామస్తులు ఏర్పాటు చేసిన లడ్డూను మంగళవారం బహిరంగ వేలంలో టీడీపీ నాయకుడు వెంకటరెడ్డి రూ.1.71లక్షలకు దక్కించుకున్నారు. అలాగే పట్టణంలోని ప్రైవేటు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

వరద బాధితులకు రూ. 25వేల విరాళం



విరాళాలు సేకరించిన విద్యార్థులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: విజయవాడ వరదబాధితులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి రూ. 25వేలు విరాళాలు సేకరించినట్లు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాల డైరెక్టర్ సీ.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సహాయనిధిని కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

వరద బాధితులకు సాయం చేయండి

కుప్పం, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు తోచిన సాయం చేయాలని కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. విజయవాడలోని ముంపు ప్రాంతాలలో ప్రజలు కట్టుబట్టలతో మిగిలారని పేర్కొంది. వీరికి సాయంకోసం కుప్పం నియోజకవర్గ ప్రజల తరఫున, పార్టీ పరంగా వివిధ రకాల నిత్యావసరాలతో కూడిన ఒక ఫ్యామిలీ కిట్ అందించడానికి నిర్ణయించినట్లు పేర్కొంది. అంచనా ప్రకారం రూ.1500 విలువ కలిగిన ఈ ఫ్యామిలీ కిట్‌లో రెండు బెడ్ షీట్లు, రెండు లుంగీలు, నైటీ, వాటర్ క్యాన్, బకెట్, మగ్, టూత్ పేస్ట్, శానిటరీ న్యాప్ కిన్ ఒక్కోటి, నాలుగు సోపులు, రెండు ఫైబర్ ప్లేట్లు, రెండు స్టీల్ గ్లాసులు, నాలుగు టూత్ బ్రష్‌లు ఉంటాయని వివరించారు. దాతలు తమ శక్తి మేరకు 9618317124 అనే ఫోన్ నెంబర్‌కు గూగుల్ పే లేదా ఫోన్ పే ద్వారా పంపాలని కుప్పం టీడీపీ, నియోజకవర్గ ప్రజలకు విన్నవించింది.

ఆలయ భూములను పరిరక్షించండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, సెప్టెంబరు10 : పలమనేరు నియోజకవర్గంలోని ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దేవదాయశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం ఎండోమెంట్ ఈవో కమలాకర్‌తో, సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూములు కొన్ని అన్యాక్రాంతం అయ్యాయని తనకు ఫిర్యాదులు వచ్చాయని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆలయ భూములను గుర్తించి వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఆలయ భూముల ద్వారా, ఆస్తుల ద్వారా చేకూరుతున్న ఆదాయంతో భక్తులకు ఆలయాల్లో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రూ. 1.20 కోట్లతో అభివృద్ధి చేయనున్న గాలిగోపురం, కోనేరు, తదితర పనులకు సంబంధించిన నమూనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆలయ సిబ్బంది భాస్కర్‌రెడ్డి, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

పలమనేరు, సెప్టెంబరు10 : పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించేందుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆడ్-అప్ కోర్సులు ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ తెలిపారు. కళాశాలలోని కోర్సులకు అనుబంధంగా ఈ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తగిన నైపుణ్యాలను అందించేందుకు ఈ కోర్సులు ఉపయోగపడుతాయని వివరించారు. ప్రస్తుతం డిప్లొమా రెండు, మూడు సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఇతర ఎక్కువ విద్యార్హతలు కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18వ తేదీ లోపు కళాశాలలో డాక్టర్ కె.స్రవంతి, హెడ్‌ఆఫ్ జనరల్ సెక్షన్‌లో నేరుగా లేదా 8790208750తో సంప్రదించవచ్చని తెలియజేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



పుంగనూరు, సెప్టెంబరు10: పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్‌రెడ్డిని పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. నాయకులు దేశాది ప్రకాశ్, గాజుల రమణ, నౌషాద్, రాజు, మునీర్, ఇమ్రాన్, నాసీర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 34మంది ఎంపిక

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: స్థానిక ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 34మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ప్లేస్ మెంట్ అధికారి యుగంధర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు చైతన్య, లోకేశ్, పవన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ఉలవల పంపిణీ

కల్లూరు, సెప్టెంబరు 10: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు సబ్సిడీపై ఉలవ విత్తనాలు పంపిణీచేశారు. ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమ నాయుడు, నాయకులు గోపినాయుడు, మునిచంద్ర నాయుడు, దేవ, పార్థసారధినాయుడు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: మండలంలోని మోదగులపల్లె, ఏతూరు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై ఉలవ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన నాయకులు విరూపాక్షి, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు

రొంపిచెర్ల,సెప్టెంబరు10: సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని సైకాలజిస్టు డాక్టరు ఉదయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో బాలికలు, ఉర్దూ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు ప్రపంచ ఆత్మహత్యల దినోత్సవం సందర్భంగా సమస్యలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే ఆవేశపడకుండా కొంత సమయం ఆలోచిస్తే ఆత్మహత్యలు జరగవని తెలియజేశారు. విద్యార్థి దశలో చదువుపైనే దృష్టి ఉండాలని సూచించారు. చదువుకంటే ఏదీ గొప్పది కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో ఇందిర, ఎంఈవో-2 శ్రీనివాసులు, హెచ్‌ఎం లోకనాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన భజన, కోలాట ప్రదర్శన

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 10 : బైరెడ్డిపల్లెలోని నెహ్రూ నగర్‌లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి జరిగిన చెక్కభజన, కోలాట ప్రదర్శన భక్తులను అలరింపజేసింది. తీర్థం గ్రామానికి చెందిన ధనకొండ గంగమాంబ భజనమండలి కళాకారులు గురువు యువరాజ్ ఆధ్వర్యంలో వివిధ దేవతా మూర్తులకు సంబంధించిన భక్తిగీతాలకు చేసిన చెక్కభజన ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులను నిర్వాహకులు అభినందించి సత్కరించారు. ఈ కళాప్రదర్శనకు గాయకులు అమరావతి, సుబ్రమణ్యం, వేణుగోపాల్‌కు తబలిస్ట్ నాగరాజు వాయిద్యసహకారం అందించారు.

పుంగమ్మ చెరువు ఆక్రమణకు యత్నాలు



విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు, సెప్టెంబరు10: పుంగమ్మ చెరువు ఆక్రమణకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం చెరువుకట్టపై మట్టిదిబ్బలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపట్టణంలోని పాత ఇళ్ల కూల్చిన మట్టి, వ్యర్థపదార్థాలను కట్టపై నిల్వ చేసి కొంచెం కొంచెంగా పూడ్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. చెరువును పడమర వైపు నుంచి దురాక్రమణ జరుగుతున్నా మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి చెరువు కట్టపై మట్టి నిల్వ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు భాస్కర్, శ్రీను, నాగరాజ, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై రగడ

అర్థాంతరంగా ముగిసిన గుడుపల్లె మండల సమావేశం

గుడుపల్లె, సెప్టెంబరు 10: మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై మండల సమావేశంలో రగడ నెలకొంది. మంగళవారం శ్రీశక్తి భవనంలో ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో అభివృద్ధికి నిధులు లేక అప్పులు చేసి పనులు చేస్తున్నామని సంవత్సరాలుగా నిధులు రాకపో వడంతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని కొడతనపల్లె సర్పంచ్ వెంకటేశు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశాలు జరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని గుడుపల్లె సర్పంచ్ చంద్రా యన్ విచారం వ్యక్తం చేశారు. తహసీల్దారు సీతారామ్ స్పందిస్తూ గ్రామాల్లో ప్రజల రెవెన్యూ పరమైన సమస్యలను తన దృష్టికి వచ్చిక వెంటనే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి గురించి వివరిస్తుండగా మట్టిరోడ్లు, బోరు మోటార్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, మురుగు కాలువలు, ప్రభుత్వ భవనాలకు రంగులు, మరమ్మతులు తదితర 94 పనులకు సంబంధించి సంగం పనులు చేయకుండానే బిల్లులు పెట్టి ప్రజాధనం దుర్వినియోగం చేశారని కొడతనపల్లె సర్పంచ్ వెంకటేశు, మరో సర్పంచ్ లావణ్య ఆరోపించారు. దీనికి సమాధానం చెప్పాలని ఎంపీపీ వరలక్ష్మిని నిల దీశారు. ఈ సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం జరగడంతో సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్సూర్, జడ్పీటీసీ క్రిష్ణమూర్తి, పలుశాఖల అధికారుల, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోలాహలంగా ఉట్లోత్సవం..నిమజ్జనం



ఇరికిపెంటలో బంగారు, వెండి నాణాలను దక్కించుకున్న శ్రీనివాసులు నాయుడు, గల్లా ధనశేఖర్ తదితరులు, ఫజులూపేటలో జరిగిన వినాయకుని నిమజ్జన ఊరేగింపు

రొంపిచెర్ల, సెప్టెంబరు10: బొమ్మయ్య గారిపల్లె పంచాయతీ ఫజులుపేటలో మంగళవారం వినాయక నిమజ్జనం కోలాహలంగా సాగింది. హిందు, ముస్లింలు వసంతాలు చల్లుకుంటూ, బాణసంచా పేల్చుతూ గణపయ్యను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

రామకుప్పం: వినాయక నిమజ్జనోత్సవం రామకుప్పంలో వైభవంగా జరిగింది. స్థానిక రామనగర్‌కాలనీ, కోదండరామనగర్ కాలనీల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను యువకులు డప్పులు హోరు మధ్య పుర వీధుల్లో ఊరేగించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని, డప్పుల హోరుకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. ఊరేగింపు అనంతరం విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సోమల: మండలంలో కోలాహలంగా నిమజ్జన కార్యక్రమాలు కోలా హలంగా జరిగాయి. ఈ క్రమంలో స్వామి లడ్డూ, స్వామివారి బొడ్డులోని వెండి నాణేలను దక్కించుకోవడానికి యువకులు పోటీలు పడ్డారు. ఇరికిపెంటలో స్వామివారి బంగారు నాణెంను మాజీ సర్పంచు కే.శ్రీని వాసులు నాయుడు రూ. 1,65,000, లడ్డూను రూ.18వేలుకు ప్రసన్న కుమార్, వెండి కాయిన్‌ను గల్లా ధనశేఖర్ రూ.51 116కు దక్కించు కు న్నారు. కమ్మపల్లెలో బంగారు నాణెంను గుత్తా విజయ్ రూ. 1,05,000కు, హుండీలోని కానుకలు రూ.81,000కు చెన్నై ప్రసాద్, లడ్డూను చీమల ముడి జయంత్ రూ. 30వేలుకు దక్కించుకున్నారు. కాసామిట్టలో గుత్తా భానుప్రకాశ్ బంగారు నాణెంను రూ. 1,06,000కు, హుండీలోని కానుకలను జయలలితమ్మ రూ.86 వేలుకు, లడ్డూను ఉత్తేజ్ నాయుడు రూ. 45 వేలుకు పోటీ పడి దక్కించుకున్నారు. ఇరికిపెంట బంగ్లా వద్ద వెండి కాయిన్‌ను రెడ్డి ప్రసాద్ రూ.1లక్షా 7వేలుకు, మరో వెండి నాణెంను శివయ్యనాయుడు రూ. 60 వేలుకు, లడ్డూను నాగార్జున నాయుడు రూ. 12 వేలుకు వేలంలో దక్కించుకున్నారు. సూరయ్యగారి పల్లెలో అత్తే యోగీశ్వర వెండి కాయిన్‌ను రూ. 5116, లడ్డూను పి. వాసుదేవ్ రూ. 13,000, సోమల మండలం గట్టువారిపల్లెలో లడ్డూను విజయ్ రూ.10వేలకు, కాయిన్‌ను చంద్రశేఖర్ రూ.12,116, స్వామివారి వస్త్రాలను నాగభూషణం రూ. 5వేలుకు దక్కించుకున్నారు. సోమల జయంతి కాలనీలో లడ్డూను వీ.స్వాతి రూ.4వేలుకు, వెండి కాయిన్ వీ. కృష్ణసాయి రూ. 4వేలుకు, వస్త్రాలను, కలశం పాత్రలు, సామగ్రిని రూ.5వేలుకు ఉమాదేవి దక్కించుకున్నారు. కాగా సోమల కొత్తపేట, బస్టాండ్, శెట్టివారివీధిలో యువత రంగునీళ్ల చల్లుకుంటూ ఉత్సాహంగా ఉట్లోత్సవంలో పాల్గొన్నారు. విజేతలకు శివాలయం రాయల్ యూత్ పలు బహుమతులు అందజేశారు.



సోమలలో ఉట్లోత్సవం, కల్లూరులో గణేశుడి ఊరేగింపు



రామకుప్పంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరులో గణనాధుని నిమజ్జనం వేడుకలు కొనసాగాయి. దాసరిగూడెంలో గణనాధుని విగ్రహానికి ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సకాలంలో పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారం



బాధితులతో మాట్లాడుతున్న ప్రసాద్

చిత్తూరు, సెప్టెంబరు 10: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటివరకు అందిన సమస్యల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. తాజాగా నాలుగు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శుభ్‌దిన్ భోజనానికి దాతల నుంచి స్పందన



వెదురుకుప్పం, సెప్టెంబరు 10: శుభ్‌దిన్ భోజనం ఏర్పాటుకు దాతల నుంచి స్పందన లభిస్తోందని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కేశవులు తెలిపారు. మిట్టకండ్రిగకు చెందిన పూర్వ విద్యార్థి ఎన్ఆర్ఐ శేషాద్రి మంగళవారం 153 మంది విద్యార్థులకు భోజన వితరణ చేశారన్నారు. ఆగస్టులో ముగ్గురు దాతలుగా వ్యవహించడి ఈనెలలో ఇప్పటికే ఇద్దరు అందించారన్నారు. తిరుమలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మ్యాథ్స్‌తో మెదడుకు మరింత పదును



మ్యాథ్స్ మెలకువలు వివరిస్తున్న శివప్రసాద్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 10: మ్యాథమెటిక్స్ ప్రతి విద్యార్థి మెదడుకూ మరింత పదును పెడుతుందని గణిత అవధాని అరుణశివప్రసాద్ అన్నారు. టీఎస్ కన్నన్ జయంతి పురస్కరించుకుని పూర్వ విద్యార్థులతో ఆయన మంగళవారం స్థానిక పాఠశాలలో మ్యాథ్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక, ఏపీ మ్యాథ్స్ ఫోరం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మ్యాథ్స్‌లోని మెలకువలను తెలియజేశారు. పుట్టిన తేదీలపై అనుకున్న సంఖ్యను తెలియజేయడం, సంకలనాల్లో మెట్టమొదటి మొత్తాన్ని, స్పెల్లింగ్ ద్వారా సంఖ్యాకార్డులను యాదృచ్ఛికంగా తీయడంతో మ్యాథ్స్ మ్యాజిక్ షో విద్యార్థులను అబ్బురపరచింది. అనంతరం అవధాని ప్రసాద్‌ను పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రమణ్యం, మునిరత్నం. హెచ్ఎం తులసిబాబు సత్కరించారు.

తల్లిదండ్రుల మాలధారణ విశేషం : ఎమ్మెల్యే మురళి



కేశవులు తల్లిదండ్రుల చిత్రపటానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మురళి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 10: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని ఎమ్మెల్యే మురళిమోహన్ అన్నారు. మంగళవారం అగరంపల్లెలోని దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ కేశవులు తల్లిదండ్రుల దీక్షా మాలధారణ ఇరుముడి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా విశ్రాంత ఏడీసీ తల్లిదండ్రుల చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మురళి మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులకు సమయాన్ని కేటాయించి వారితో గడపాలన్నారు. అయ్యప్ప, శివమాల, గణేష్ దీక్ష తరహాలో తల్లిదండ్రుల మాలధారణను ఆచరించడం హర్షించదగ్గ విషయమన్నారు. తల్లిదండ్రులను శ్రద్ధగా చూసుకుంటే ఓల్డేజ్ హోమ్‌లు కనుమరుగవుతాయన్నారు.

నేడు పెనుమూరు మండల సర్వసభ్య సమావేశం

పెనుమూరు, సెప్టెంబరు 10: మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరగనుంది. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి మంగళవారం ఈ విషయం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే థామస్ హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరవ్వాలని ఆయన కోరారు.

పాఠశాల నిర్వహణలో లోపాలు కనిపిస్తే చర్యలు

నగరి, సెప్టెంబరు10:పాఠశాల నిర్వహణలో లోపాలు కనిపిస్తే చర్యలు తప్పవని ట్రైనింగ్‌ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారి కల్పనా శైలజ పేర్కొన్నారు. కరకంతాపురం, అడవికొత్తూరు, కీళపట్టు బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల నిర్వహణలో లోపాలు తలెత్తకూడదని హెచ్చరించారు. భవిత పాఠశాలను కూడా సందర్శించారు. ఎంఈఓ శ్రీదేవి, టీక్యూఆర్ఎల్ జిల్లా కోఆర్డినేటర్ లోకనాథం, సీఎంఓ ఉదయలక్ష్మి, ఏఎస్ఓ నరోత్తమరెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు సూదులు వేస్తే చర్యలు

గుడిపాల, సెప్టెంబరు 10: ఆర్ఎంపీల ఆధ్వర్యంలో నడిచే ప్రైవేటు క్లినిక్‌లో సూదులు, సెలైన్లు ఎక్కించరాదని వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం గుడిపాల మండలంలో ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే రోగులకు సూదులు, యాంటీబయాటిక్స్, సెలైన్లు వినియోగించరాదని ఆదేశించారు. మెడికల్ షాపుల్లో క్లినిక్‌లు నిర్వహించరాదన్నారు.

అసలే మలుపులు.. ఆపై పిచ్చిమొక్కలు



గుడిపాల, సెప్టెంబరు 10: మండలంలోని పలు గ్రామాల రహదారి మలుపుల్లో ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండిక్రిష్ణాపురం, బండపల్లి, చిత్తపార, రఘునాథపురం, వసంతాపురం, మొగరాలపల్లి, చీలాపల్లి, చవటన్‌తంగాళ్ తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. దీనికితోడు పిచ్చిమొక్కలు కూడా పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు

బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 9: అక్టోబరు 3 నుంచి 13 వరకు జరిగే గిరింపేట దుర్గాంబ ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ వి.కె.విశ్వనాథ్, ఈవో మునిశేఖర్‌లు ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ దిలీప్‌రెడ్డితోపాటు సభ్యులు, కోడిబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొటేషన్ల ఆహ్వానం

ప్రత్యేక అలంకారం, పూలు, చలువ పందిళ్లు, బ్యాండుమేళం, డప్పులు, బాక్సులు, స్టీల్ ప్లేట్స్, పంబల, వంటమాస్టర్ తదితర ఏర్పాట్లకు అర్హత పొందిన కాంట్రాక్టర్స్ నుంచి కొటేషన్స్ కోరుతున్నట్లు ఆలయ ఈవో మునిశేఖర్ తెలిపారు. కొటేషన్స్ ఈనెల 21లోపు ఆలయ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ముగ్గురు నాటు సారా విక్రేతల అరెస్ట్

పాలసముద్రం, సెప్టెంబరు 10: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో నాటుసారా తయారుచేసి విక్రయిస్తున్న కేసులో కుప్పన్, చిట్టిబాబు, కుట్టియప్పన్‌లను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముగ్గురిపై ఇప్పటికే పాత కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఎస్ఐ భారతి చెప్పారు. వీరు కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 10: వరద బాధితులను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆదుకుంటోందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విపత్తుల నుంచి కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సహాయక చర్యల్లో పాల్గొన్నానన్నారు. 76 ఏళ్ల వయస్సులో కూడా సీఎం రాత్రింబవళ్లు ప్రజలకోసం పని చేయడం ప్రజలపట్ల ఆయనకున్న సేవాభావమే నిదర్శనమన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆర్థిక సాయం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 10: విభిన్న ప్రతిభావంతులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం స్థానిక బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో విభిన్న ప్రతిభావంతులు కలసి గురజాలను సన్మానించారు. ఈ నెల 23న నిర్వహించనున్న అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం సందర్భంగా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ తరఫున రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందించారు.

గంటా కమలమ్మ సాహితీ పురస్కారాలకు కవితల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 10: ఈ ఏడాది గంటా కమలమ్మ సాహితీ పురస్కారం కోసం కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కార వ్యవస్థాపకులు, అరసం జిల్లా అధ్యక్షులు గంటా మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత రెండేళ్లలో వివిధ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వెలువడి పాఠకుల మన్ననలు పొందిన కవితా సంపుటాలు పంపించాలున్నారు. రచనలను అక్టోబరు 15వ తేది సాయంత్రం లోపు గంటామోహన్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంగారుపాళ్యం -517416 అనే చిరునామాకు పంపాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9440467311ను సంప్రదించాలని మోహన్ కోరారు.

మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

వెదురుకుప్పం, సెప్టెంబరు 10: దేవరగుడిపల్లె మాజీ ఎంపీటీసీ పుష్పమ్మ(65) మృతి తీరని లోటు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ సంతాపం ప్రకటించారు. ఆమె దేవరగుడిపల్లె అభివృద్ధికి విశేష కృషి చేశారని మండల టీడీపీ యువనేత పేట చూడామణిరెడ్డి శ్లాఘించారు. సోమవారం పుష్పమ్మ మృతిచెందిన విషయం తెలుసుకుని నేతలు సంతాపం ప్రకటించారు.

అంగన్‌వాడీ భవనం లేక ఇబ్బందులు

గుడిపాల, సెప్టెంబరు 10: మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌కు సొంత భవనంలేదు. దీంతో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అప్పుడప్పుడు పెచ్చులూడడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనాన్ని మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకమునుపే భవనాన్ని నిర్మించాలని అభ్యర్థిస్తున్నారు.

మహిళా పాలిటెక్నిక్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

పలమనేరు, సెప్టెంబరు10 : పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించేందుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆడ్-ఆన్ కోర్సులు ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ తెలిపారు. కళాశాలలోని కోర్సులకు అను బంధంగా ఈ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తగిన నైపుణ్యాలను అందించేందుకు ఈ కోర్సులు ఉపయోగపడుతాయని వివరించారు. ప్రస్తు తం డిప్లొమా రెండు, మూడు సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఇతర ఎక్కువ విద్యార్హతలు కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18వ తేదీ లోపు కళాశాలలో డాక్టర్ కె.స్రవంతి, హెడ్‌ఆఫ్ జనరల్ సెక్షన్‌లో నేరుగా లేదా 8790208750తో సంప్రదించవచ్చని తెలియజేశారు.

సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు

రొంపిచెర్ల,సెప్టెంబరు10: సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని సైకాలజిస్టు డాక్టరు ఉదయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో బాలికలు, ఉర్దూ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు ప్రపంచ ఆత్మహత్యల దినోత్సవం సందర్భంగా సమస్యలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే ఆవేశపడకుండా కొంత సమయం ఆలోచిస్తే ఆత్మహత్యలు జరగవని తెలియజేశారు. విద్యార్థి దశలో చదువుపైనే దృష్టి ఉండాలని సూచించారు. చదువుకుంటే ఏదీ గొప్పది కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో ఇందిర, ఎంఈవో-2 శ్రీనివాసులు, హెచ్ఎం లోకనాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాణిజ్య సముదాయం



వెదురుకుప్పం, సెప్టెంబరు 10: కార్వేటినగరం మేజర్ పంచాయతీలో వాణిజ్య సముదాయం నిరుపయోగంగా ఉంది. చాలా కాలం క్రితం ప్రభుత్వ ధనంతో నిర్మించినా వేలం పాట నిర్వహించడంలేదు. ఈ షాపులకు వేలం పాట నిర్వహిస్తే గ్రామ పంచాయతీకి కొంత ఆదాయం కూడా సమకూరేది. ఇప్పటికే ఇవి మరమ్మతులకు గురయ్యాయి. వానొస్తే ఉరుస్తున్నాయి. మరమ్మతుల తర్వాత వేలం పాట నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి చెప్పారు. దీనిపై సమగ్ర వివరాలను ఇవ్వాలని కార్వేటినగరం మేజర్ పంచాయతీ అధికారిని కోరతామన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం

స్పందిస్తున్న హృదయాలు





కలెక్టర్‌కు విరాళ చెక్కును అందిస్తున్న బాస్ సంస్థ ప్రతినిధులు- ఎమ్మెల్యే గురజాలకు రూ.2 లక్షల చెక్‌ను అందిస్తున్న ప్రైవేట్ బస్ ఆపరేటర్లు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు జిల్లా ప్రైవేట్ బస్ ఆపరేటర్స్ అసోసియేషన్ రూ.2 లక్షల విరాళం ప్రకటించింది. అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిసి చెక్ అందించారు. ప్రైవేట్ బస్ ఆపరేటర్లు సీఎంటీ త్యాగరాజన్, తిరుకుమరన్, శివ, గోపి, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక బాస్ స్వచ్ఛంద సంస్థ రూ.74,657 విరాళం ప్రకటించింది. ఈమేరకు చెక్కు రూపంలో సంస్థ ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి అందించారు. సంస్థ ప్రతినిధులు రవి, అంజాద్, కిశోర్, భాస్కర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. **చిత్తూరు కల్చరల్:** గిరింపేట పీవీకేయన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.50 వేల వితరణ చేశారు. మంగళవారం వారు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను ఆయన నివాసంలో కలిసి చెక్కును అందజేశారు. వాకర్స్ సంఘం అధ్యక్షుడు శివాజీరావ్, ప్రధాన కార్యదర్శి వీకె. విశ్వనాథ్, గౌరవాధ్యక్షులు చిన్నబ్బనాయుడు, ఉపాధ్యక్షుడు సుందరమూర్తి, కోశాధికారి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పెనుమూరు:** తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

చిత్తూరు (సెంట్రల్): స్థానిక విజ్ఞానసుధ విద్యా సంస్థల చైర్మన్ శ్రీధర్ మంగళవారం స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిసి రూ.85,345 చెక్కును అందజేశారు. చెక్కును అందించిన వారిలో కళాశాల అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి



సీఐకి వినతిపత్రం అందిస్తున్న తెలుగు యువత నాయకులు

నగరి సెప్టెంబరు10: ఎంఎల్‌ఏ గాలి భానుప్రకాష్‌పై గతేడాది అక్టోబరు 13న దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శిసలీమ్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు శ్రీధర్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం సీఐ మహేశ్వర్‌కు కలిసి కోరారు. అప్పట్లో ఆర్‌కే రోజా ఆదేశాల మేరకు ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాల వద్ద వైసీపీ కార్యకర్తలు మాటు వేసి దాడి చేశారన్నారు. కారు డ్రైవర్ చాకచక్యంగా వెనక్కి తిప్పేయడంతో భానుప్రకాష్ ప్రాణాలు దక్కాయన్నారు. వాహనాన్ని తిరుపతి వైపు తిప్పినా తమిళనాడుకు చెందిన తిరుత్తణి వాసి ప్రత్యూష్, రౌడీమూకలు కారును వెంబడించి దాడులు చేశారన్నారు. ఈసంఘటనలో భానుప్రకాష్ వాహనం ధ్వంసమైందన్నారు. దాడిలో పాల్గొన్న వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేయగా నాటి సీఐ నామమాత్రపు కేసులు పెట్టారన్నారు. కేసు తిరగదోడి నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కేసు పూర్వాపరాలను పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని సీఐ మహేశ్వర్ తమకు హామీ ఇచ్చినట్లు తెలుగుయువత నాయకులు పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ కన్నయ్య, సైదిలి, షేక్‌కళాందర్‌జాకీర్, కరిముల్లా విక్కీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపకపోతే ప్రాణత్యాగాలకు సిద్ధం



రాస్తారోకో చేస్తున్న వామపక్ష నాయకులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపకపోతే ప్రాణత్యాగాలకు సిద్ధమని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. మంగళవారం జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు కుట్రలు పన్నతోందని విమర్శించారు. ఏఐటీయూసీ, సీఐటీయు నాయకులు నాగరాజు, గంగరాజు, గిరిధర్, గోపీనాథ్, మునిరత్నం, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నగరి పరిసర గ్రామాల్లో గంగజాతర సందడి



సప్తకన్యల అలంకరణలో ఓరుగంటాలమ్మ

నగరి, సెప్టెంబరు10: నగరితోపాటు పరిసర 72 గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర సందడి మొదలైంది. దేశమ్మ,ఓరుగంటాలమ్మ ఆలయాల వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అక్కాచెల్లెళ్లుగా భావించే ఓరుగంటాలమ్మ, దేశమ్మ, గంగమ్మలు గ్రామం మధ్య జాతర స్థలంలో కొలువు తీరుతారు. ఏడాదికోసారి ఊరిమధ్యలోకి తీసుకొచ్చి కుంభం అన్నం పెట్టి సంతృప్తిగా పొలిమేర దాటించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం రాత్రి దేశమ్మ, ఓరుగంటాలమ్మలు మహిషాసురమర్దిని, సప్తకన్యల రూపంలో జాతర స్థలానికి చేరుకున్నారు. అర్ధరాత్రి గంగమ్మ వేపాకు పందిరికి చేరుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: పుంగనూరు- రామసముద్రం మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా రామసముద్రానికి చెందిన రామకృష్ణ, భార్య సుకన్య ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ గాయపడ్డారు. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జాబ్‌మేళాలో 34మంది ఎంపిక

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: స్థానిక ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 34మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ప్లేస్ మెంట్ అధికారి యుంగధర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు చైతన్య, లోకేశ్, పవన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

రూ. 1.71లక్షలు పలికిన చదళ్ల వినాయకుడి లడ్డూ

పుంగ నూరు, సెప్టెంబరు 10: పుంగనూరు మండలం చదళ్ల గ్రామంలో వినాయక విగ్రహం వద్ద గ్రామస్తులు ఏర్పాటు చేసిన లడ్డూను మంగళ వారం బహిరంగ వేలంలో టీడీపీ నాయకుడు వెంక టరెడ్డి రూ.1.71లక్షలకు దక్కించుకున్నారు. అలాగే పట్టణం లోని ప్రైవేటు బస్టాండ్ లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

బంగారమ్మకు విశేష పూజలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 10: కార్వేటినగరంలోని బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రంగనాథమొదలియార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే సుబ్రహ్మణ్యంస్వామికి అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

రాయితీతో ఉలవల పంపిణీ

వెదురుకుప్పం, సెప్టెంబరు 10: రాయితీతో ఉలవలు అందుబాటులో ఉన్నాయని కార్వేటినగరం ఏవో హేమలత తెలిపారు. డీఎంపురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లి రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 80 శాతం రాయితీతో ఉలవలను ఇస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పది కేజీల బ్యాగును రూ.174 చెల్లించి తీసుకోవాలన్నారు.

సక్రమంగా విధి నిర్వహణ:ఎంపీడీవో

పాలసముద్రం, సెప్టెంబరు10: మండలంలోని సచివాలయాల సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో రామనాథరెడ్డి కోరారు. మంగళవారం ఆముదాల, నర్సింహాపురం సచివాలయాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకుల నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈవో పీఆర్‌డి రమేష్, పంచాయతి కార్యదర్శి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్ట పుట్టాలమ్మ జాతర



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 10: ఎస్ఆర్‌పురం మండలం విలాసవరహాపురం గ్రామంలోని కట్ట పుట్టాలమ్మ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారు పూలతో ప్రత్యేక అలంకరించారు. కోలాట నడుమ గ్రామంలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దయ్యశెట్టి, హేమాద్రి యాదవ్, బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తవణంపల్లె, సెప్టెంబరు 10: సంతపల్లెలో అంగన్‌వాడీ వర్కరు(జనరల్), నారసింహనపల్లె, కారకాంపల్లె, వీర్లగుడిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలు నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నిర్మల కోరారు. అంగన్‌వాడీ వర్కరు ఎస్సీ కేటగిరికి చెందిన వారై ఉండాలన్నారు. హెల్పర్ పోస్టుకు ఓసీ కెటగిరికి చెందిన వారై ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై అభ్యర్థులు 21 సంవత్సరాల నుంచి 35 లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 12 నుంచి 21వ తేది సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాణిపాకం క్రాస్ వద్ద సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫొటో, కుల, నివాస ధ్రువపత్రాలను దరఖాస్తుకు జత చేయాలని ఆమె సూచించారు.**నగరి:** సత్రవాడ-1 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు బీసీ-బీ, నింద్ర మండలంలో శ్రీరామాపురం ఎస్టీ కాలనీలో మినీ అంగన్‌వాడీ పోస్టుకు ఎస్టీ కేటగిరి, కీళంబాకం దళితవాడలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు ఓసీ కేటగిరి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కృష్ణవేణి సూచించారు.. దరఖాస్తులతో పాటు ఆధార్,రేషన్ కార్డుల, 10 వతరగతి మార్కుల జాబితా,కుల, నివాస ధ్రువీకరణపత్రాలు జత చేయాలన్నారు. అవి గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించాలని సూచించారు. **వెదురుకుప్పం:** వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీల కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో పద్మసునంద ఒక ప్రకటలనో కోరారు.





కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం దేవతామూర్తుల వేషధారణలో ఆకట్టుకున్న కళాకారులు, గ్రామోత్సవంలో ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న ఆలయ ఈవో గురుప్రసాద్,తదితరులు